
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 19 మార్చి 2025

కన్నతల్లి ఆకస్మిక మృతి....

కన్నీటి పర్యంతమై పరీక్షకు

● గ్రామస్తులను కంటతడి పెట్టించిన ఘటన


తల్లి భౌతికకాయం వద్ద బోరున విలపిస్తున్న విద్యార్థిని కావ్య


గుండెపోటుతో మృతిచెందిన కళ (ఫైల్‌ఫొటో)

చెన్నై, మార్చి18(ఆంధ్రజ్యోతి): సంతోషంగా పరీక్ష రాసేందుకు బయలుదేరిన విద్యార్థిని కన్నతల్లి హఠాత్తుగా మృతి చెందడంతో కన్నీరుమున్నీరైంది. వివరాలిలా.. పట్టుకోట సమీపం వెట్టువాంకోట రామాపురం ప్రాంతం లో తల్లి ఆకస్మిక మృతితో తల్లడిల్లిన ఓ బాలిక గుండెనిబ్బరం చేసుకుని ప్లస్-2 పరీక్షకు వెళ్ళిన సంఘటన ఆ ఊరివారందరికీ కంటతడిపెట్టించింది. రామాపురం వద్ద రాజేంద్రన్, కళ అనే దంపతులు నివసిస్తున్నారు. వీరి మూడో కుమార్తె కావ్య ఊరనిపురం ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ప్లస్-2 చదువుతోంది. ప్రస్తుతం ఆ బాలిక ప్లస్-2 పబ్లిక్ పరీక్షలు రాస్తోంది. ప్రతి రోజూ తల్లి ఆశీర్వాదం తీసుకుని బొట్టు పెట్టుకుని కావ్య పరీక్ష రాసేందుకు వెళ్తుండేది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆ బాలిక తల్లి గుండెపోటుతో మృతిచెందింది. తల్లి ఆకస్మిక మృతితో ఆ కుటుంబం అతలాకుతలమైంది. తల్లి మృతిని తట్టుకోలేకపోయిన ఆ చిన్నారిని బంధువులు, స్థానికులకు ఎలా ఓదార్చాలో తెలియక ఇబ్బంది పడ్డారు. 'చదువే నిన్ను కాపాడుతుంది. ప్లస్-2 పరీక్షలు బాగా రాసి మంచి పేరుతెచ్చుకో' అంటూ చెప్పిన తల్లిమాటలు గుర్తుకు తెచ్చుకున్న కావ్య వెంటనే పరీక్షకు సన్నద్ధమైంది. తల్లి భౌతిక కాయం వద్ద నిల్చుని, 'అమ్మా పరీక్ష రాయడానికి వెళుతున్నా నన్నాశీర్వదించి విభూతి పెట్టవా?' అంటూ కావ్య బోరున విలపించగానే బంధువులంతా కంటతడిపెట్టుకున్నారు. కాసేపయ్యాక ఓ బంధువుతో కలిసి బైకు మీద కావ్య పరీక్ష రాయడానికి వెళ్లింది.. ఈ విషయమై కళ బంధువులు మాట్లాడుతూ కావ్య సోదరికి 15 రోజుల క్రితమే వివాహం అయిందని, ఆమె అన్నయ్య కాలేజీలో చదువుతున్నాడని, భర్త మానసిక రోగి అయినప్పటికీ కళ కుటుంబాన్ని నడుపుకుంటూ వచ్చిందని తెలిపారు. కావ్య అంటే ఆమెకు అపారమైన ప్రేమ అని, బాగా చదివి ఉన్నత స్థితికి రావాలని పదే పదే చెబుతుండేదని, ఈ పరిస్థితుల్లో తల్లి మృతి వల్ల కలిగిన శోకాన్ని భరిస్తూ కావ్య తల్లి మాట ప్రకారం పరీక్ష రాయడానికి వెళ్లటం తమకు మరింత దుఃఖాన్ని కలిగించిందన్నారు.



ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను ఆహ్వానిస్తున్న డీఎంకే ఎంపీలు కనిమొళి, కళానిధి వీరాసామి, రాజా తదితరులు - ఏఐఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీని ఆహ్వానిస్తున్న ఎంపీలు కనిమొళి, రాజా

ఉమ్మడి పోరుకు సై

● నియోజవర్గాల పునర్విభజనపై సమావేశానికి 20 మంది నేతలు

● స్టార్ హోటల్‌లో సభకు భారీ ఏర్పాట్లు

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పునర్విభజన వ్యతిరేకంగా జరుగనున్న తొలి విడత ఉమ్మడి కార్యాచరణ సభకు హాజరయ్యేందుకు 20 పార్టీల నేతలు అంగీకరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లోక్‌సభ నియోజక వర్గాలను జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేస్తే తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలు, పంజాబ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని, పార్లమెంట్ ఉభయ సభల్లో దక్షిణాది ఎంపీల ప్రాధాన్యం బాగా తగ్గిపోతుందంటూ ఈ విషయమై చర్చలు జరిపేందుకు ఏర్పాటు చేస్తున్న ఉమ్మడి కార్యాచరణ సభకు పార్టీల తరఫున ప్రతినిధులను పంపాలని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ వివిధ పార్టీల నేతలకు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాశారు. అదే సమయంలో రాష్ట్ర మంత్రులు, డీఎంకే ఎంపీల ద్వారా ఆయా రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, ప్రముఖ రాజకీయ పార్టీల నాయకులకు ఆహ్వానాలు అందజేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న గిండిలోని స్టార్‌హోటల్‌లో జరుగనున్న ఈ సమావేశానికి హాజరయ్యేందుకు 20 పార్టీల నాయకులు అంగీకరించినట్లు డీఎంకే నేతలు ప్రకటించారు. చోళా హోటల్ విమానాశ్రయానికి సమీపంలో ఉండటంతో వివిధ రాష్ట్రాల నుండి వచ్చే రాజకీయ నేతలు, ముఖ్యమంత్రులు సులువుగా చేరుకోగలరని చోళా షెరటాన్ హోటల్‌లో సభా వేదిక ఏర్పాటు చేస్తున్నారు. ఈ సభకు సంబంధించి డీఎంకే స్థానిక నాయకులు, మంత్రులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి డీఎంకే నేతతో రాజకీయపరంగా సన్నిహిత సంబంధాలుండటంతో ఆమె తప్పకుండా ఈ సభకు హాజరయ్యే అవకాశం ఉంది. ఒక వేళ ఆమె రాకపోయినా ఆమె తరఫు ప్రతినిధి హాజరుకానున్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్ ఇప్పటికే ఈ సభకు వచ్చేందుకు తన అంగీకారాన్ని ప్రకటించారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ తరఫు ప్రతినిధిని ఈ సమావేశానికి పంపుతారని తెలుస్తోంది. వైకాపా అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ సభలో పాల్గొనేందుకు అంగీకరించినట్లు డీఎంకే వర్గాలు పేర్కొన్నాయి. డీఎంకే మిత్రపక్షంగా కాంగ్రెస్ ఉండటం వల్ల తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సభకు తప్పకుండా హాజరవుతారు. ఇదే విధంగా పంజాబ్, ఒడిశా, బీహార్ రాష్ట్రాలకు సంబంధించి పాలకపక్షం ప్రతినిధులు, ప్రతిపక్షానికి చెందిన ప్రతినిధులు కూడా ఈ సభకు రానున్నారు. ఇక ఈ సభకు వచ్చే నేతలను విమానాశ్రయం నుంచి సభావేదిక వరకు తీసుకొచ్చేందుకు డీఎంకే తరఫున ఆహ్వాన కమిటీలు కూడా ఏర్పాటయ్యాయి.

అసెంబ్లీలో ఈపీఎస్, సెంగోటయ్యాన్ చెట్టాపట్టాల్!

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : నెల రోజులుగా ఎడముఖం పెడముఖంగా వ్యవహరించిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్), ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి సెంగోటయ్యన్ మంగళవారం శాసనసభలో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుండడం అటు అన్నాడీఎంకే సభ్యులకు, ఇటు డీఎంకే దాని మిత్రపక్షాల సభ్యులకు విస్మయం కలిగించింది. విడిపోయి మళ్ళీ కలిస్తే పొందే ఆనందమే వేరు అన్నట్లుగా ఈ ఇద్దరు నాయకులు ప్రవర్తిస్తుండటం అన్నాడీఎంకే నేతలకు సంతోషాన్ని కలిగిస్తోంది. శాసనసభలో పాఠశాలల విద్యాశాఖకు సంబంధించి అన్నాడీఎంకే సభ్యుడు, మాజీ మంత్రి సెల్లూరు కే రాజు అడిగిన ప్రశ్నలకు ఆ శాఖా మంత్రి అన్బిల్ మహేష్ వివరణ ఇచ్చారు. అదే సమయంలో ఈపీఎస్ లేచి మాజీ విద్యాశాఖ మంత్రి, తమ పార్టీ సభ్యుడు సెంగోటయ్యన్‌కు మాట్లాడేందుకు అనుమతించాలంటూ స్పీకర్ అప్పావుపై ఒత్తిడి చేశారు. సెల్లూరు రాజు ప్రశ్నలకు మంత్రి అన్బిల్ మహేష్ సమగ్రంగా బదులివ్వటంతో ఇక చర్చ కొనసాగించడం అనవసరమని స్పీకర్ తెలిపారు. మంత్రి వివరణతో సంతృప్తి చెందని సెల్లూర్ రాజు మళ్ళీ మాట్లాడేందుకైనా అనుమతించాలని అన్నాడీఎంకే సభ్యులంతా మూకుమ్మడిగా నినాదాలు చేశారు. ఆ సందర్భంగాను ఈపీఎస్, సెంగోటయ్యన్ చిరునవ్వులు చిందించారు.



థర్మాకోల్ సంగతి విడిచిపెట్టరా?

శాసనసభలో పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, అన్నాడీఎంకే మాజీ మంత్రి సెల్లూరు కే రాజు మధ్య బడ్జెట్‌లో రామేశ్వరంలో విమానాశ్రయం ఏర్పాటు విషయమై ఆసక్తికరమైన చర్చలు కొనసాగాయి. తొలుత సెల్లూరు రాజు మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వం గద్దె దిగటానికి ఇక యేడాది మాత్రమే ఉందని, అలాంటప్పుడు రామేశ్వరంలో యేడాదిలోగా విమానాశ్రయం ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. పరిశ్రమల శాఖమంత్రి టీఆర్‌బీ రాజా బదులిస్తూ ద్రావిడ తరహా పాలనలో విమానాశ్రయం ఏర్పాటు చేయడానికి పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని అదే సమయంలో విమానాశ్రయం నిర్మించడం నదిలో థర్మాకోల్ వేసేంత తేలికైన పని కాదన్నారు. వెంటనే సెల్లూరు రాజు మాట్లాడుతూ ఇంకా థర్మాకోల్ థర్మాకోల్ అంటూ తనను హేళనగా విమర్శిస్తూనే ఉంటారా? అని ప్రశ్నించారు. అధికారులు చెప్పటం వల్లే రిజర్వాయర్‌పై థర్మాకోల్ అట్టలతో మూశానని, తనకు తాను అలా చేయలదేని, ప్రస్తుతం మంత్రులు ఎలా అధికారుల సూచనలను పాటిస్తున్నారో అలాగే తాను అధికారుల మాట విని థర్మాకోల్ కప్పానని, ఆ సంఘటన జరిగి యేళ్లుదాటినా ఇంకా ఆ పేరుతోనే తనను యెద్దేవా చేయడం న్యాయమేనా? అని ప్రశ్నించడంలో సభలో పాలక పక్ష సభ్యులు, ప్రతిపక్ష సభ్యులు గొల్లుమన్నారు.

కరుణానిధి భద్రతా విభాగంలో పనిచేసిన

రిటైర్డ్ ఎస్‌ఐ దారుణహత్య

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి భద్రతా విభాగంలో ఎస్‌ఐగా పనిచేసిన జాకీర్‌హుస్సేన్ (57) మంగళవారం ఉదయం దారుణహత్యకు గురయ్యారు. రంజాన్ ఉపవాస దీక్షలో భాగంగా దర్గాకు వెళ్ళి నమాజు చేసి ఇంటికి తిరిగి వెళ్తున్న జాకీర్ హుస్సేన్‌ను బైకులో వచ్చిన ముగ్గురు వేటకొడవళ్లతో దాడిచేసి దారుణంగా హతమార్చారు. దుండగుల బారి నుండి తప్పించుకునేందుకు జాకీర్ హుస్సేన్ ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దుండగులు జాకీర్ హుస్సేన్ తలపై కత్తులతో దాడి జరిపి మెరుపువేగంతో పారిపోయారు. అది చూసిన కొందరు పాదచారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గోపాలకృష్ణన్ తన సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తిరునల్వేలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఓ స్థలం వివాదం కారణంగా ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. తొట్టిపాళం మెయిన్ రోడ్డులో 36 సెంట్ల భూమికి సంబంధించి జాకీర్‌హుస్సేన్‌కు అదే ప్రాంతానికి చెందిన ముస్లింయువతిని వివాహమాడిన ఎస్సీ కులానికి చెందిన వ్యక్తికి మధ్య పాత తగదాలున్నాయి. ఆ నేపథ్యంలో జాకీర్‌హుస్సేన్‌పై ఆ వ్యక్తి ఫిర్యాదు మేరకు అంటరానితనం నిరోధక చట్టం కింద పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. దీంతో వారి మధ్య కక్షలు పెరిగాయి. ఆ నేపథ్యంలో జాకీర్‌హుస్సేన్‌ను హతమార్చి ఉంటారని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ హత్యకు సంబంధించిన అక్బర్‌బాషా, తవఫీక్ అనే ఇద్దరు తిరునల్వేలి కోర్టులో లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. హత్యా ప్రాంతం వద్దనున్న సీసీ ఫుటేజీ ఆధారంగా మరో హంతకుడి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు - (ఇన్‌సెట్‌లో) హత్యకు గురైన రిటైర్డ్ ఎస్ఐ జాకీర్‌హుస్సేన్

కనీస ఛార్జీ నిర్ణయించాలని

నేడు ఆటోల సమ్మె

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గత 12 యేళ్లుగా మినిమమ్ మీటర్ ఛార్జీ నిర్ణయించడానికి ఎలాంటిచర్యలు తీసుకోని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ బుధవారం చెన్నై, పరిసర జిల్లాలకు చెందిన ఆటో డ్రైవర్లు సమ్మెబాట పట్టనున్నారు. చెన్నై, సబర్బన్ ప్రాంతాలలో ప్రస్తుతం ఆటోలన్నీ మీటర్లు లేకుండానే తిరుగుతున్నాయి. ఒక వేళ మీటర్లున్నా అవి పనిచేయవు, పనిచేసిన ఆ మీటర్ ప్రకారం ఆటో డ్రైవర్లు చార్జీలు వసూలు చేసే ప్రసక్తే లేదు. దీంతో ఆటో డ్రైవర్లు గమ్యస్థానం బట్టి రూ.100 నుండి రూ200దాకా అడగటం, కస్టమర్లు వారితో బేరాలాడి ఛార్జీ తగ్గించుకుని వెళ్లటం ఆనవాయితీగా మారింది. దీనిపై ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులు మాట్లాడుతూ 2013 నుండి ప్రభుత్వం ఆటోమీటర్ ఛార్జీలను నిర్ణయించకుండా వదిలేసిందని, దీంతో మీటర్ ఛార్జీతో పనిలేకుండా కస్టమర్లతో బేరాలాడి ఆటోలు నడిపే పరిస్థితులే ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రైవేటు ఆటోల సంఖ్య విపరీతంగా పెరగటంతో సాధారణ ఆటోలు నడపటం కష్టంగా ఉందన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఆటోమీటర్ల ద్వారా మినిమమ్ ఛార్జీలను నిర్ణయించాలని కోరుతూ బుధవారం సమ్మెకు దిగుతున్నామని ప్రకటించారు. చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాల్లో ఆటోలు తిరుగవని రాష్ట్ర ఆటో కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షుడు పన్నీర్‌సెల్వం తెలిపారు.

చెన్నై పరకామణిలో

టీటీడీ ఉద్యోగి చేతివాటం

● అత్యంత విలువైన డాలర్ల నోట్లను నొక్కేసిన సీనియర్ అసిస్టెంట్

● వాటి స్థానంలో తక్కువ విలువైన వాటిని చేర్చిన వైనం

● పోలీసులకు అధికారుల ఫిర్యాదు

తిరుమల, మార్చి18(ఆంధ్రజ్యోతి): చెన్నై శ్రీవారి ఆలయంలో టీటీడీ ఉద్యోగే చేతివాటం ప్రదర్శించాడు. దాదాపు రూ.6.74 లక్షల విలువ చేసే విదేశీ కరెన్సీ నోట్లను మాయం చేసినట్టు అధికారులు తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కృష్ణకుమార్ చెన్నై శ్రీవారి ఆలయం, సమాచార కేంద్రం సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. గతేడాది అక్టోబరు 6వ తేదీన జరిగిన పరకామణి రిజిస్టర్‌లో కాలం సమస్య ఉందనే కారణంతో 950 విదేశీ కరెన్సీ నోట్లను నమోదు చేయలేదు. తిరిగి తర్వాత పరకామణి లెక్కింపు సమయంలో తిరిగి విదేశీ కరెన్సీ నోట్ల సంఖ్యను నమోదు చేశారు. అయితే గత పరకామణి లెక్కింపు జాబితాను, తాజా జాబితాను పోల్చి చూసినప్పుడు తేడా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. నిజానికి 950 నోట్లలో అధిక విలువైన డాలర్ నోట్లను మార్పిడి చేసి తక్కువ డాలర్ నోట్లను ఆస్థానంలో చేర్చినట్టు విజిలెన్స్ విచారణలో తేలింది. నోట్ల సంఖ్య కరెక్ట్‌గానే ఉన్నట్టు చూపించినప్పటికీ విలువను మాత్రం కృష్ణకుమార్ తన జేబులో వేసుకున్నట్టు విజిలెన్స్ అధికారులు ఫిబ్రవరి నెలలో జరిగిన విచారణలో గుర్తించారు. దాదాపు రూ.6.74 లక్షల కరెన్సీ చోరీ చేసినట్టు తమ నివేదికలో పేర్కొన్నారు. ఈక్రమంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా చెన్నై శ్రీవారి ఆలయ ఏఈవో పార్థసారధి ఇటీవల తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఇప్పటికే కృష్ణకుమార్‌ను టీటీడీ సస్పెండు చేస్తూ నిర్ణయం తీసుకుంది.



సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని రాష్ట్రంలో మరమగ్గాల ఆధునికీకరణకు రూ.50 కోట్ల మేర బడ్జెట్‌లో నిధులు సమకూర్చినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్న మరమగ్గాల కార్మిక సంఘాల అధ్యక్షుడు ఎల్.కె.ఎమ్.సురేష్, కార్యదర్శి ఇరా వేలుసామి తదితరులు

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:26 ((బుధవారం సాయంత్రం)
సహర్: 4:33 (గురువారం ఉదయం)

సమాచార దర్శిని

23న పొన్నేరిలో జాబ్ మేళా

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పొన్నేరిలో ఈ నెల 23న ప్రైవేటు జాబ్ మేళా జరుగనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో... పొన్నేరిలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలల్లో నిర్వహించనున్న ఈ శిబిరంలో తిరువళ్లూర్, చెన్నై, కాంచీపురం జిల్లాలకు చెందిన సుమారు 150 ప్రైవేటు సంస్థలు పాల్గొని 10వేలకు పైగా పోస్టులు భర్తీ చేయనున్నాయి. శిబిరంలో 8,10, ప్లస్ టూ తరగతులు, ఐటీఐ, డిప్లొమో, ఇంజనీరింగ్, నర్సింగ్ కోర్సులు పూర్తయిన వారు పాల్గొనవచ్చు. ఆసక్తి కలిగిన వారు www.tripri vatejobs.tn. gov.in అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఎంఎన్ఎం ఆధ్వర్యంలో 'స్పోకెన్ ఇంగ్లీష్' శిక్షణ

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణ ఇవ్వనున్నారు. అమెరికాలోని మహోన్నత పాఠశాల విద్యార్థుల ద్వారా నడుస్తున్న 'లీప్' అనే సంస్థ, దేశంలోని ప్రాంతాల్లో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణ అందిస్తోంది. ఆ ప్రకారం, లీప్ సహకారంతో 6 నుంచి ప్లస్ టూ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ఆన్‌లైన్‌లో స్పోకెన్ ఇంగ్లీషు ఉచిత శిక్షణా తరగతులు ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఆరు వారాలు నిర్వహిస్తున్నట్లు ఎంఎన్ఎం ఒక ప్రకటనలో తెలిపింది.

నాలుగు విమానాల రద్దు

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండడంతో నాలుగు విమానాలు రద్దయ్యాయి. హైదరాబాద్ నుంచి ఉదయం 11.10 గంటలకు చెన్నై రావాల్సిన విమానం, చెన్నై నుంచి మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్ వెళ్లాల్సిన విమానం రద్దయ్యాయి. అలాగే, నిర్వహణ కారణాలతో లండన్ నుంచి ఉదయం 5.35 గంటలకు చెన్నై రావాల్సిన, చెన్నై నుంచి ఉదయం 7.45 గంటలకు లండన్‌కు వెళ్లాల్సిన బ్రిటీస్ ఎయిర్‌వేస్ విమానాలు రద్దయ్యాయి.

సాంకేతిక లోపం...

చెన్నై నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానంలో హఠాత్తుగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో, విమానాన్ని రన్‌వేపై అత్యవసరం నిలిపివేశారు. నిపుణులు గంటన్నర సేపు శ్రమించి లోపం సరిచేయడంతో ఆలస్యంగా 142 మంది ప్రయాణికులతో విమానం బయల్దేరి వెళ్లింది.

24న స్వాధీనం చేసుకున్న వాహనాల వేలం

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లికరణై పోలీస్ స్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్న 146 వాహనాలు వేలం ద్వారా విక్రయించనున్నారు. ఈ మేరకు తాంబరం పోలీసు కమిషనర్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో.. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 146 ద్విచక్రవాహనాలను ఈ నెల 24వ తేది బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఆసక్తి కలిగిన వారు గుర్తింపు కార్డు, జీఎస్‌టీ నెంబరు తదితరాలతో పల్లికరణై పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 20వ తేది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు పేర్లు నమోదుచేసుకోవాలి. పేర్లు నమోదుచేసుకున్న వారి సమక్షంలో ఈ నెల 24వ తేది ఉదయం 10 గంటలకు వేలం జరుగుతుందని ప్రకటనలో తెలిపారు.

500 బాల కేంద్రాల నిర్మాణం

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది 500 బాల కేంద్రాల నిర్మాణానికి ముఖ్యమంత్రి స్టాలిన్ నిధులు కేటాయించారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతాజీవన్ తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... శిశు సంక్షేమ కేంద్రాలను విద్యతో పాటు ఆరోగ్య సంరక్షణ చేపట్టే బాల కేంద్రాలు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. గత ఏడాది 1,503 కేంద్రాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించి 1,203 కేంద్రాలు నిర్మించామని తెలిపారు. ఈ ఏడాది 500 కేంద్రాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రోడ్డు పక్కనే ఉన్న బాల కేంద్రాలకు ప్రహరీ నిర్మించాలని నిర్ణయించినట్లు, అందుకు కేంద్రాల వివరాలు సేకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 72,600 మంది చేరిక

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో 11 రోజుల్లో 72,600 మంది విద్యార్థులు చేరినట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. 2025-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 1వ తేది నుంచి అడ్మిషన్లు ప్రారంభించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తమ ప్రాంతాల్లోని ఇళ్లకు వెళ్లి, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగు, షూ, యూనిఫాం, విద్యా సామగ్రి, ఉపకారవేతనం, అల్పాహారం తదితరాలను ఉపాధ్యాయులు తెలియజేస్తున్నారు. దీంతో, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో, అడ్మిషన్లు ప్రారంభించిన రోజు నుంచి 11 రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 72,600 మంది విద్యార్థులు చేరినట్లు పాఠశాల విద్యాశాఖ తెలియజేసింది.

2.53 లక్షల తాబేళ్ల గుడ్ల సేకరణ

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంతాల్లో 2.53 లక్షల తాబేళ్ల గుడ్లు సేకరించినట్లు అటవీ శాఖ తెలిపింది. రాష్ట్రంలో ప్రతి ఏడాది డిసెంబరు నుండి మార్చి వరకు, తాబేళ్లు తీర ప్రాంతాలకు వచ్చి ఇసుకలో గుంతలు తవ్వి గుడ్లు పెట్టి వెళ్తుంటాయి. ఈ గుడ్లు పక్షులు, ఇతర జంతువుల నుంచి రక్షించి అటవీ శాఖ వాటికి సేకరించి, ప్రత్యేక ప్రాంతంలో పొదిగించి, పిల్లలు వచ్చిన తర్వాత వాటిని సముద్రంలోకి వదిలి పెడుతుంటారు. ఆ ప్రకారం, గత జనవరి నుంచి ఈ నెల 16వ తేది వరకు రాష్ట్రంలోని సముద్రతీరాల్లోని 55 ప్రాంతాల్లో 2.53 లక్షల గుడ్లు సేకరించారు. కడలూరులో అధికంగా 87,871, నాగపట్టణంలో 73,385, చెన్నైలో 43,900 గుడ్లు సేకరించినట్లు అటవీ శాఖ తెలియజేసింది.

ట్రెక్కింగ్ ద్వారా రూ.63.43 లక్షల ఆదాయం

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టెక్కింగ్ చేసే వారి (కొండలు ఎక్కే క్రీడాకారులు) ద్వారా రూ.63.43 లక్షల ఆదాయం లభించిందని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేసిన వివరాలు ఇలా ఉన్నాయి... గత మూడు నెలల్లో 4,792 ట్రెక్కింగ్ చేసినవారి ద్వారా రూ.63.43 లక్షల ఆదాయం లభించింది. అందులో రూ.49.51 లక్షలు నేరుగా ట్రెక్కింగ్ అభివృద్ధికి తోడ్పతున్న గిరిజన యువకులకు అందించామని, ప్రకృతి అందాలు ఆస్వాదించే ట్రెక్కర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం స్వాగతం పలుకుతోంది. ఏప్రిల్ నుంచి ట్రెక్కింగ్ ప్రారంభించనున్నట్లు సీఎం తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.





కుంభాభిషేకం యాగశాలల మండపం వద్ద కాపలా కాస్తున్న పోలీసులు - ఆలయ ప్రాంగణం వద్ద నిలిపి ఉంచిన పోలీసు వాహనాలు

ఆలయ కుంభాభిషేకంలో ఇరువర్గాల ఘర్షణ

● పోలీసుల లాఠీఛార్జితో ఆగిన వేడుకలు

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా ఆలంగుడి సమీపం కోవిలూరులోని లోకనాయకి అమ్మాళ్ సమేత బాలపురీశ్వరర్ ఆలయ కుంభాభిషేక వేడుకల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకోవడంతో ఆగిపోయింది. ఘర్షణ అదుపు చేయడానికి పోలీసులు లాఠీ ఛార్జీ చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఆలయం చుట్టూ పోలీసు బలగాలను మోహరించారు. ఆ ఆలయ కుంభాభిషేకం నిర్వహించే విషయంలోనే ఇరువర్గాల మధ్య గొడవలు వచ్చాయి. పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు జోక్యం చేసుకుని కుంభాభిషేకం జరిపేందుకు ఇరువర్గాలను ఒప్పించారు. ఆ తర్వాత సోమవారం ఉదయం ఆలయ కుంభాభిషేక వేడుకలు ప్రారంభమయ్యాయి. రాత్రి అమ్మవారిని ఊరేగించేటప్పుడు పల్లకీ మోసే విషయంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ ప్రారంభమైంది. ఒక వర్గానికి వ్యతిరేకంగా మరొక వర్గానికి చెందినవారంతా ధర్నా, రాస్తారోకో జరిపారు. ఈ విషయం తెలిసి ఇరువర్గాలను శాంతింపజేసేందుకు వెళ్ళిన పోలీసులకు చేదు అనుభవం ఎదురైంది. ఇరువర్గాల వారి మధ్య తోపులాటలు, తొక్కిసలాట జరిగింది. అదే సమయంలో దుండగులెవరో దాడి జరపటంతో ఆలంగుడి సీఐ శివసుబ్రమణియన్ తలకు గాయాలయ్యాయి. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఆలంకుడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన దరిమిలా ఆ ఆలయం వద్ద ఘర్షణలకు పాల్పడినవారిని పోలీసులు లాఠీ ఛార్జి చేసి తరిమికొట్టారు. ఈ సమాచారం అందుకున్న ఎస్పీ అభిషేక్ గుప్తా ఇతర పోలీసు ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను సమీక్షించారు. ఆ తర్వాత ఎస్పీ ఆదేశాల మేరకు ఆ ఆలయం చుట్టూ ఉన్నా ప్రాంతాల్లో 250 మందికి పైగా పోలీసు బలగాలను మొహరించారు.

ఘనంగా వఠారణ్యేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు



సంపూర్ణ పుష్పాలంకరణలో కారైక్కాల్ అమ్మవారు



అమ్మవారి ఊరేగింపు తిలకిస్తున్న భక్తులు

తిరుత్తణి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వరాలయానికి అనుబంధం గా ఉన్న తిరువలంగాడు వఠారణ్యేశ్వరాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పరమేశ్వరుడు నాట్యభంగిమలో ఉండే ఐదు శైవక్షేత్రాల్లో తొలిక్షేత్రంగా ఈ ఆలయం ప్రసిద్ధిచెందింది. హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం వరకు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు భక్తులు పలు జిల్లాల నుండి పెద్దసంఖ్యలో వచ్చి స్వామివారిని సేవించుకున్నారు. కారైక్కాల్ అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ రాజ గోపురం వద్ద ఊంజల్ సేవ నిర్వహించారు.

కోట్టూరుపురం జంట హత్యల కేసులో 12 మంది అరెస్టు



అరెస్టయిన సుక్కుకాఫీ సురేష్ తదితరులు

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోట్టూరుపురంలో ఓ గుడి వద్ద నిద్రపోతున్న రౌడీ అరుణ్, అతడి స్నేహితుడు సురేష్‌పై వేటకొడవళ్ళు, కత్తులతో దాడి జరిపి దారుణంగా హత్యచేసిన కేసులో 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని హతమార్చిన 10 మందిని, ఈ హత్యకు పథకం రూపొందించిన మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. హంతకులు సేలంలో దాక్కున్నారనే సమాచారంతో ప్రత్యేక దళం పోలీసులు ఆ నగరానికి వెళ్ళి మంగళవారం వేకువజామున రౌడీ సురేష్ అలియాస్ సుక్కుకాఫీ సురేష్, విగ్నేష్, సహా 12 మందిని అరెస్టు చేశారు.

కూవత్తూరు వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సు దగ్ధం



బస్సులోని మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కూవత్తూరు వద్ద పుదుచ్చేరి నుండి నగరానికి వస్తున్న రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన ఎక్స్‌ప్రెస్ సర్వీస్ బస్సు మంటల్లో దగ్ధమైంది. మంగళవారం ఉదయం ఆ బస్సు ముగయూరు వద్ద వెళ్తుండగా చెడిపోయింది. డ్రైవర్, కండెక్టర్ కలిసి ఆ బస్సుకు తాత్కాలికంగా మరమ్మతు చేశారు. ఆ తర్వాత నెమ్మదిగా బస్సు నడుపుకుంటూ వస్తుండగా కూవత్తూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో ఉన్నట్లు బస్సు ముందువైపు మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్, కండెక్టర్లు, ఇతర ప్రయాణికులు బస్సులోంచి కిందకు దిగిపోయారు. ఆ తర్వాత అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఈ సమాచారం అందుకుని సెయ్యూరు, కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రం అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ సంఘటన కారణంగా ఈస్ట్‌కోస్ట్‌రోడ్డులో అరగంటసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

డీఎంకే ఎమ్మెల్యే విజయం చెల్లుతుంది

ప్యారీస్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విక్రవాండి ఉప ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి అన్నియూర్ శివ గెలుపు చెల్లుతుందని మద్రాస్ హైకోర్టు తీర్పువెలువరించింది. విక్రవాండి శాసనసభ సభ్యుడిగా వ్యవహరించిన పుహళేంది అనారోగ్యం కారణంగా మృతిచెందడంతో ఆ నియోజకవర్గం ఖాళీ అయ్యింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు 2024 జూలైలో రాష్ట్ర ఎన్నికల అధికారులు పోలింగ్ పూర్తిచేశారు. ఈ ఉప ఎన్నికల ఫలితాల్లో డీఎంకే తరుపున పోటీచేసిన అన్నియూర్ శివ 67,757 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. అయితే శివ గెలుపు చెల్లదని ప్రకటించాలని కోరుతూ జాతీయ మక్కల్ శక్తి పార్టీ అభ్యర్థి రాజమాణిక్యం మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో తనకు వ్యతిరేకంగా దాఖలైన ఎన్నికల కేసు రద్దుచేయాలని కోరుతూ ఎమ్మెల్యే అన్నియూర్ శివ కూడా పిటిషన్ వేశారు. ఈ రెండు కేసులపై మంగళవారం విచారణ జరిపిన న్యాయమూర్తి జీకే.ఇళంద్రియన్ అన్నియూర్ శివకు మద్దతుగా తీర్పు వెలువరించారు.

జల్లికట్టులో మృతిచెందిన యువకుడికి సీఎం ఆర్థిక సాయం

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జల్లికట్టు ఎద్దు దాడిలో మృతిచెందిన యువకుడికి కుటుంబానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆర్థికసాయం ప్రకటించారు. మదురై జిల్లా కీళక్కరై గ్రామంలోని కలైంజర్ సెంటినరీ మైదానంలో ఈ నెల 16వ తేది నిర్వహించిన జల్లికట్టు పోటీల్లో పాల్గొన్న కచ్చిరాయిరుప్పు గ్రామానికి చెందిన మహేష్ పాండి, ఎద్దును అదుపుచేసే క్రమంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయమై సచివాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... జల్లికట్టు పోటీల్లో మహేష్ పాండి మృతిచెందడం తనను దిగ్భ్రాంతి గురిచేసింది. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, రూ.3 లక్షలు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు సీఎం ప్రకటించినట్లు సచివాలయం తెలియజేసింది.

అనుమతిలేకుండా ధర్నా

● అన్నామలై సహా 1,078 మందిపై కేసు

ప్యారీస్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ సంస్థలో రూ.1,000 కోట్ల మేర అవినీతి జరిగిందని ఆరోపిస్తూ రాజధాని నగరంలో అనుమతి లేకుండా సోమవారం ధర్నాలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సహా 1,078 మంది కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదుచేశారు. టాస్మాక్ ప్రధాన కార్యాలయం, మద్యం గోదాము, డిస్టలరీల్లో ఈ నెల 6వ తేదీ ఈడీ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో, దాదాపు రూ.వెయ్యి కోట్ల మేరకు అవినీతికి సంబంధించి ఆధారాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మెగా అవినీతికి నిరసనగా నగరంలో టాస్మాక్ ప్రధాన కార్యాలయాన్ని సోమవారం ముట్టడించేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు యత్నించారు. ఎగ్మూర్ బయల్దేరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, తమిళిసై సౌందరరాజన్, ఎమ్మెల్యేలు వానతీ శ్రీనివాసన్, సరస్వతి, సీనియర్ నేత ఎస్.చక్రవర్తి, కేంద్రమాజీ మంత్రి పొన్‌రాధాకృష్ణన్ సహా 1,078 మంది అనుమతిలేకుండా ఆందోళన చేశారని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యా రుణం మంజూరుకు లంచం

● బ్యాంక్ ఉద్యోగికి నాలుగేళ్ల జైలు

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా నజరేత్‌లో ఉన్న జాతీయ బ్యాంక్‌లో విద్యా రుణం మంజూరుకు లంచం ఆశించిన కేసులో బ్యాంక్ పార్ట్ టైం ఉద్యోగికి హైకోర్టు మదురై బెంచ్ నాలుగేళ్ల జైలుశిక్ష విధించింది. ఈ బ్యాంక్‌లో సీనియర్ మేనేజర్‌గా సాముయేల్ జబరాజ్, పార్ట్ టైం ఉద్యోగిగా నారాయణన్ (63) పనిచేస్తున్నారు. నర్సింగ్ కోర్సు చదివేందుకు రుణం కావాలని ఇద్దరు విద్యార్థినులు బ్యాంక్‌లో 2010లో దరఖాస్తు చేసుకున్నారు. రుణం మంజూరుకు రూ.8,000 లంచం తీసుకున్నారని సామ్యూల్ జబరాజ్, నారాయణన్‌లపై సీబీఐ కేసు నమోదుచేసింది. మదురై సీబీఐ న్యాయస్థానంలో ఈ కేసు విచారణ జరుగుతోంది. నేరం నిరూపణవలేదంటూ 2018లో ఈ కేసు నుంచి ఇద్దరినీ సీబీఐ న్యాయస్థానం విడుదల చేసింది. ఈ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ హైకోర్టు మదురై బెంచ్‌లో సీబీఐ తరఫున అప్పీలు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి కేకే రామకృష్ణన్... పేద విద్యార్థుల సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం విద్యా రుణ పథకం అమలుచేస్తోంది. ఈ పథకం కింద పేద విద్యార్థులకు బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి. ఈ పథకంలో మోసం చేయడం, లంచం ఆశించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ కేసులో విద్యార్థికి రూ.62,500 విద్యా రుణం ఇచ్చేందుకు రూ.8 వేలు లంచం ఆశించడం బాధాకరమన్నారు. సాముయేల్ జబరాజ్ తరఫున నారాయణన్ లంచం తీసుకున్నారు. ఈ నేరారోపణ రుజువు కావడంతో, దిగువ కోర్టు ఇచ్చిన తీర్పు రద్దు చేస్తున్నామన్నారు. ఈ కేసులో సాముయేల్ జబరాజ్ మృతిచెందిన నేపథ్యంలో, నారాయణన్‌కు నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.1.50 లక్షల జరిమానా విధిస్తున్నామన్నారు. బాధిత విద్యార్థులు రుణం కోసం పడిన ఇబ్బందులు పరిగణలోకి తీసుకొని జరిమానా మొత్తం నుంచి ఒక్కొక్కరికి రూ.35 వేలు పరిహారంగా అందించాలని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో ఆదేశించారు.

పొదటూర్‌పేటలో యువకుడి ఆత్మహత్య



సూర్య (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బంధువులు బైక్ ఈఎంఐ కట్టమని ఇచ్చిన నగదును తన సొంత ఖర్చులకు వాడుకున్నాడని ప్రశ్నించడంతో మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరువళ్లూరు జిల్లా పల్లిపట్టు సమీపంలోని పొదటూర్‌పేటలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, పొదటూర్‌పేట రామసముద్రంలో కూరగాయల వ్యాపారం చేసుకునే సూర్య (28)కు అతని బంధువు బైక్ ఈఎంఐ కట్టమని కొంత నగదు ఇచ్చిపంపించాడు. అయితే సూర్య ఆ డబ్బును ఈఎంఐ చెల్లించకుండా ఖర్చుచేశాడు. ఇంతలో బైక్ ఫైనాన్స్ ఏజెంట్ ఇంటికి రావడంతో విషయం తెలుసుకున్న అతని బంధువు, సూర్యను రోడ్డుపై ఆపి ఆవేశంతో దుర్భాషలాడాడు. దీనిపై ఆవేదన చెందిన సూర్య తన ఊరికి సమీపంలోని బుచ్చిరెడ్డిపల్లె అటవీప్రాంతంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పశువులను మేతకోసం తీసుకొచ్చిన ఓ వ్యక్తి అది చూసి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసునమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఇదిలా వుండగా పదేళ్ళ క్రిందట ప్రేమవివాహం చేసుకున్న సూర్యకు సంతానం లేకపోవడం కూడా ఈ ఆత్మహత్యకు కారణమైవుంటుందా? లేక ఇంకేదైనా కారణమా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

'అంబులెన్స్'గా మారిన ప్రభుత్వ బస్సు

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అస్వస్థతకు గురైన మహిళను ఆస్పత్రికి తరలించేందుకు ప్రభుత్వ బస్సు అంబులెన్స్‌గా మారింది. తిరుప్పూర్ పాత బస్టాండ్ నుంచి పల్లడం మీదుగా అరాంకుళంకు సోమవారం మధ్యాహ్నం ప్రభుత్వ టౌన్ బస్సు బయల్దేరింది. పల్లడం బస్టాండ్‌లో బస్సు ఎక్కిన ఓ మహిళ స్వల్ప అస్వస్థతకు గురికాగా, కొద్దిసేపటికే స్పృహతప్పి పడిపోయింది. ఈ విషయాన్ని ప్రయాణికులు కండక్టర్ శక్తివేల్‌కు తెలిపారు. అతను అంబులెన్స్ కోసం ప్రయత్నించినా, జాప్యం జరగడంతో, పల్లడం రవాణా సంస్థ డిపో మేనేజర్ సెంథిల్‌కుమార్ సమాచారం ఇచ్చారు. బస్సులోని ప్రయాణికులను వేరే బస్సులో పంపించి, బాధితురాలిని బస్సులోనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని మేనేజర్ సూచించారు. దీంతో, పలువురు ప్రయాణికులు వేరే బస్సులో వెళ్లగా, కొందరు మాత్రం తాము కూడా ఆసుపత్రి వరకు వస్తామని తెలిపారు. దీంతో, డ్రైవర్ రాసుకన్నన్ బస్సును అంబులెన్స్‌గా హారన్ కొడుతూ వేగంగా తిరుప్పూర్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. వైద్యులు ఆ మహిళకు చికిత్సఅందించారు. మహిళ ప్రాణాలు కాపాడిన బస్సు, డ్రైవర్‌ను వైద్యులు, ప్రజలు అభినందించారు.

పరీక్షా కేంద్రంలో మొబైల్‌ఫోన్

● హెడ్మాస్టర్ సస్పెన్షన్

టి.నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు సమీపంలో ప్లస్-2 పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రంలో మొబైల్‌ఫోన్ ఉపయోగించిన ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. తిరుప్పూరు అప్పాచ్చినగర్ ప్రాంతంలోని ప్రైవేటు పాఠశాలలో ప్లస్-2 పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. ఆ పరీక్షల పర్యవేక్షకుడిగా ఊత్తుక్కుళి ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాల హెచ్ఎం దామోదరన్ వ్యవహరించారు. ఈ నెల 11న పరీక్షా కేంద్రంలో ఆయన మొబైల్‌ఫోన్ ఉపయోగించినట్లు ఫిర్యాదులందాయి. వాటిపై జిల్లా విద్యాశాఖాధికారులు విచారణ జరిపారు. ఆ విచారణలో దామోదరన్ మొబైల్‌ఫోన్ ఉపయోగించినట్లు రుజువైంది. దీనితో జిల్లా విద్యాశాఖాధికారులు ఆయనను సస్పెండ్ చేశారు.

ముగ్గురు రామేశ్వరం జాలర్ల అరెస్టు

టి.నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నెడుదీవి వద్ద మంగళవారం వేకువజాము న చేపలు పడుతున్న రామేశ్వరం ప్రాంతానికి చెందిన ముగ్గురు జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడిచేసి అరెస్టు చేసింది. జాలర్లు ఉపయోగించిన మరపడవను, జీపీఎస్ తదితర పరికరాలను కూడా స్వాధీనం చేసుకుంది. ఆ ముగ్గురు జాలర్లను శ్రీలంకలోని కాంగేశన్‌రేవు కోస్ట్‌గార్డ్ శిబిరానికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న రామేశ్వరం జాలర్ల సంఘాల నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రామేశ్వరంలో రాజస్థాన్ భక్తుడి మృతి

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం ఆలయానికి దర్శనానికి వచ్చిన ఉత్తరాది రాష్ట్రానికి చెందిన భక్తుడు స్పృహతప్పి మృతిచెందాడు. రామేశ్వరం రామనాథస్వామి ఆలయం మంగళవారం ఉదయం స్పటికలింగం దర్శనం కోసం తెరిచారు. అందులో రూ.50 టిక్కెట్లు కొనుగోలు చేసి క్యూలైన్‌లో ఉన్న రాజస్థాన్ రాష్ట్రం సిక్కర్ జిల్లా సివాట్‌పూర్ ప్రాంతానికి చెందిన రాజ్‌దాస్ (59) అనే భక్తుడు స్పృహతప్పి పడిపోయాడు. అక్కడ డ్యూటీలో ఉన్న పోలీసులు, అతనిని వెంటనే ఆలయ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు, అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించిన తిరుకోవిల్ పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సబర్బన్ రైలు నుంచి జారిపడి విద్యార్థి మృతి

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం సమీపంలో సబర్బన్ రైలు నుంచి జారిపడి కళాశాల విద్యార్థి మృతిచెందాడు. కాంచీపురం సమీపం ఆరపాక్కం గ్రామానికి చెందిన విశ్వ (20) మీనంబాక్కంలోని ఓ ప్రైవేటు కళాశాలలో థర్డ్ బీఏ చదువుతున్నాడు. అతను ప్రతిరోజు తిరుమాల్పూర్ నుంచి చెన్నై బీచ్‌కు వెళ్లే సబర్బన్ రైలులో కళాశాలకు వెళ్తుంటాడు. సోమవారం విశ్వ కళాశాలకు వెళ్లేందుకు సబర్బన్ రైలు ఎక్కాడు. బోగీలో ప్రయాణికులు అధికంగా ఉండడంతో విశ్వ ఫుట్ బోర్డుపై నిలబడి ప్రయాణిస్తున్నాడు. తాంబరం సమీపంలో హఠాత్తుగా కాలుజారి విశ్వ కింద పడి మృతిచెందాడు. ఈ ఘటనపై తాంబరం రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నీటితొట్టెలో పడి బాలుడి మృతి

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందున్న నీటితొట్టెలో పడి బాలుడు మృతిచెందిన ఘటన కోవై జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. కరుమత్తంపట్టికి చెందిన చిరంజీవి విక్రమ్ (2) ఉదయం ఇంటి ముందు ఆడుకుంటూ హఠాత్తుగా అదృశ్యమయ్యాడు. ఎంతసేపటికి కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు చుట్టపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో, ఇంటి ముందున్న నీటితొట్టెలో విక్రమ్ మృతిచెంది ఉండడాన్ని గమనించిన తల్లిదండ్రులు బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. నీటితొట్టెపై మూత సక్రమంగా మూయకపోవడంతో విక్రమ్ ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది.

సెల్‌ఫోన్ చూడొద్దని మందలింపు

● 9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని తల్లిదండ్రులు మందలించడంతో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కడలూరు జిల్లాలో చోటుచేసుకుంది. కాట్టుమన్నార్‌కోయిల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని సెల్‌ఫోన్ కోసం అధిక సమయం కేటాయిస్తోంది. ఎప్పుడూ సెల్‌ఫోన్ చూస్తున్న ఆమెను చదువుపై దృష్టి సారించాలని చెప్పిన తల్లిదండ్రులు ఆమె దగ్గర నుంచి సెల్‌ఫోన్ తీసుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన బాలిక, సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఆంధ్రాకు తరలిస్తున్న 400 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరుక్కుపేటలో ఆంధ్రా రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న 400 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో కార్డుదారులకు ఉచితంగా ఇచ్చే బియ్యాన్ని కొందరు అక్రమంగా ఆంధ్రా రాష్ట్రానికి తరలిస్తున్నారు. అక్రమ రవాణాను అడ్డుకొనేలా పోలీసులు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, సోమవారం రాత్రి కొరుక్కుపేట రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు చేపట్టిన తనిఖీల్లో, ప్రయాణికులు కూర్చొనే బెంచీల కింద దాచిన 400 కిలోల రేషన్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

కోవిలంబాక్కం వంటగ్యాస్ లీకేజీలో పెరిగిన మృతుల సంఖ్య

ప్యారీస్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక షోలింగనల్లూర్ సమీపంలోని కోవిలంబాక్కం గాంధీనగర్ 15వ వీధిలోని ఓ ఇంటిలో ఈనెల 5వ తేదీ వంట గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవించడంతో నిద్రపోతున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. మునుస్వామి (75), అతని భార్య రాణి(70), కుమార్తె శాంతి (45), అల్లుడు రఘు (48), మనుమడు హరిహరన్ (20) మంటల్లో చిక్కుకోవడంతో వారిని చుట్టుపక్కల వారు కీల్పాక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో చికిత్స ఫలించక మునుస్వామి, శాంతి, హరిహరన్ గత వారం మృతిచెందారు. ఈ నేపథ్యంలో రాణి కూడా సోమవారం మృతిచెందినట్లు మేళవాక్కం పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. కాగా, రఘుకు చికిత్స కొనసాగిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

తిరునల్వేలిలో విద్యుదాఘాతానికి గురై హాకీ క్రీడాకారుడు సహా ఇద్దరి మృతి



వేలాయుధం (ఫైల్‌ఫొటో)

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి కొక్కిరకుళం ప్రాంతంలో విద్యుదాఘాతానికి గురై హాకీ క్రీడాకారుడు, అతడిని కాపాడేందుకు ప్రయత్నించిన కార్మికుడు మృతి చెందారు. ఈ ఇద్దరిని కాపాడటానికి ప్రయత్నించిన మరో కార్మికుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కొక్కిరకుళం ప్రాంతంలో నివసిస్తున్న గజేంద్రన్ తన ఇంటి ముందున్న మరుగుదొడ్డి మరమ్మతులను కార్మికులతో చేయిస్తున్నాడు. ఆ మరుగుదొడ్డి గోడ ఆనుకుని విద్యుత్ మీటర్ బాక్స్‌లో విద్యుత్ పరికరాలు భద్రపరిచాడు. ఈ నేపథ్యంలో మంగళశారం ఉదయం గజేంద్రన్ కుమారుడు వేలాయుధం (30) విద్యుత్ మీటర్ బాక్స్ తెరచి అందులో ఉన్న పరికరాలను తీస్తుండగా షాక్ కొట్టడంతో అరిచాడు. కేకలు విని ఆ ఇంటిలో పనిచేస్తున్న ఇద్దరు కార్మికులు అతడిని కాపాడేందుకు ప్రయత్నించారు. వారిలో మారియప్పన్ అనే కార్మికుడు వేలాయుధాన్ని కాపాడే ప్రయత్నంలో కరెంట్‌షాక్ గురై నేలపై పడ్డాడు. అది చూసి రవి అనే కార్మికుడు కూడా వారిని కాపాడేందుకు ప్రయత్నించి కరెంట్‌షాక్ గురై తీవ్రంగా గాయపడ్డారు. ఇలా విద్యుదాఘాతానికి గురైన ముగ్గురిని అంబులెన్స్‌లోతిరునల్వేలి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్నండగా మార్గమధ్యంలో వేలాయుధం, మారియప్పన్ ప్రాణాలుకోల్పోయారు. ఈ ఇరువురిలో వేలాయుధం హాకీ క్రీడాకారుడని, స్పోర్ట్స్ కోటాలో చెన్నైలో ప్రభుత్వ ఉద్యోగం వచ్చే తరుణంలో ఇలా ఆకస్మికంగా కరెంట్‌షాక్‌కు గురై మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై పాళయంకోట పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

సొంత ప్రచారం చేసుకోవడం లేదు



● ఇనియా

చిత్రపరిశ్రమలో నటిగా ఉన్నప్పటికీ సామాజిక బాధ్యతతో తాను చేసే ఏ మంచి పనిని సొంత ప్రచారం కోసం ఉపయోగించుకోవడం లేదని హీరోయిన్ ఇనియా అంటున్నారు. తమిళం, మలయాళ చిత్రపరిశ్రమల్లో వైవిధ్యభరితమైన పాత్రలను ఎంచుకుంటూ తన సినీ కెరీర్ కొనసాగిస్తున్న హీరోయిన్ అయిన ఇనియా ఒక్క సినిమాపైనే కాకుండా, పలు శాఖలపై దృష్టి సారించి రాణిస్తున్నారు. ప్రధానంగా సామాజిక బాధ్యతతో కూడిన అనేక కార్యక్రమాలను ఆమె నిర్వహిస్తున్నారు. తాజాగా నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, 'సినిమాల్లో నటించడం వల్ల ఇతరులను ప్రోత్సహించవచ్చని భావిస్తే, అలాంటి సినిమా రంగంలో ఎందుకు రాణించకూడదన్న భావన నాలో ఉంది. సమాజానికి మేలు చేసే కార్యక్రమాలను చేస్తున్నాను. కానీ, వాటిని సొంత ప్రచారం కోసం ఉపయోగించుకోవడం లేదు. సహజంగా సినీ నటి కావడంతో మీడియా సంస్థలు స్వతహాగా వార్తలుగా ప్రచురిస్తున్నాయి' అని పేర్కొన్నారు.

15 యేళ్ళ తర్వాత కొత్త మెరుగులతో ఆర్య - నయనతార సినిమా



'బాస్ ఎన్‌గిర భాస్కరన్'లో ఓ దృశ్యం

తమిళ చిత్రజ్యోతి

ఆర్య, నయనతార, సంతానం నటించిన 'బాస్ ఎన్‌గిర భాస్కరన్' చిత్రాన్ని 15 యేళ్ళ తర్వాత అత్యాధునిక సాంకేతికతను జోడించి రీ రిలీజ్ చేయనున్నారు. సాధారణంగా ఎన్నో యాక్షన్, హర్రర్ చిత్రాలు వస్తున్నప్పటికీ పూర్తి హాస్యభరిత కమర్షియల్ చిత్రాలను తమిళ ప్రేక్షకులు అమితంగా ఆదరిస్తుంటారు. అయితే, ఇటీవలి కాలంలో ఈ తరహా చిత్రాలు రావడం లేదు. దీంతో కామెడీ ప్రధానాంశంతో తెరకెక్కిన పాత చిత్రాలను ఇపుడు రీ రిలీజ్ చేస్తున్నారు. ఆ కోవలోనే ఆర్య, నయనతార, సంతానంతో పాటు జీవా, విజయలక్ష్మి, చిత్రా లక్ష్మణన్, షకీలా, మొట్టై రాజేంద్రన్, సుబ్బు పంజు, అశ్విన్ రాజా, స్వామినాథన్ తదితరులు నటించగా ఎం.రాజేష్ దర్శకత్వం వహించిన 'బాస్ ఎన్‌గిర భాస్కరన్' చిత్రాన్ని రీ రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేశారు. యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చిన ఈ మూవీలోని పాటలన్నీ సూపర్ హిట్‌గా నిలిచాయి. ఇందులో సంతానం చెప్పిన 'నణ్బేండా' అనే డైలాగ్ నేటికీ పాపులర్‌గా మిగిలిపోయింది. ఇదే పేరుతో ఏకంగా ఒక చిత్రమే వచ్చిందంటే ఆ డైలాగ్ ఎంతగా పాపులర్ అయిందో ఇట్టే గ్రహించవచ్చు. ఇపుడీ మూవీని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తమిళనాడు వ్యాప్తంగా ఈ నెల 21న రీ రిలీజ్ చేస్తున్నారు.

విష్ణు - మమత జంటగా 'ఇరండు వానం'



'ఇరండు వానం'లో విష్ణు విశాల్ - మమతా బైజు

విష్ణు విశాల్, మమతా బైజు జంటగా నటించే కొత్త చిత్రానికి 'ఇరండు వానం' అనే టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. 'ముండాసుపట్టి', 'రాట్చసన్' వంటి హిట్ చిత్రాలను రూపొందించిన దర్శకుడు రాంకుమార్ కథ సమకూర్చి, దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ప్రముఖ సీనియర్ నిర్మాత టీజీ త్యాగరాజన్ సమర్పణలో సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ సంయుక్తంగా సత్యజ్యోతి ఫిలిమ్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటుంది. ఫుల్‌లెంగ్త్ ఫాంటసీ నేపథ్యంలో రూపొందించారు. ఈ చిత్రం గురించి నిర్మాతల్లో ఒకరైన సెంథిల్ త్యాగరాజన్ మాట్లాడుతూ, 'మా బ్యానరులో వచ్చే చిత్రాలన్నీ యూనివర్సల్ ఆడియన్స్‌ను అలరించేలా ఉంటాయి. ఈ కారణంగానే కొన్ని దశాబ్దాలుగా వాణిజ్య వర్గాలతో పాటు సినీ ప్రేమికుల ఆదరణ పొందుతున్నాం. తాజాగా 'ఇరండు వానం' అనే కొత్త ప్రాజెక్టు ప్రకటించడానికి సంతోషిస్తున్నాం. బ్లాక్ బస్టర్ హిట్ కాంబినేషన్‌గా గుర్తింపు పొందిన విష్ణు విశాల్ - రాంకుమార్ కాంబినేషన్‌లో ఈ మూవీ రూపొందింది. గత చిత్రాల తరహాలోనే ఈ చిత్రాన్ని కూడా ప్రేక్షకులు ఆదరిస్తారన్న గట్టి నమ్మకం ఉంది. షూటింగ్ పూర్తి కావడంతో ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు. ఆడియో, ట్రైలర్, మూవీ రిలీజ్ తేదీలపై త్వరలో ప్రకటిస్తాం' అన్నారు.

సూపర్‌స్టార్ 'కూలీ' షూటింగ్ పూర్తి



సూపర్‌స్టార్ రజనీకాంత్ - యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'కూలీ' షూటింగ్ పూర్తయినట్టు నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. ఈ మూవీలో రజనీతో పాటు బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్, టాలీవుడ్ స్టార్ అక్కినేని నాగార్జున, కన్నడ నటుడు ఉపేంద్ర, తమిళ సీనియర్ నటుడు సత్యరాజ్, శృతిహాసన్ తదితరులు నటించారు. నిర్మాత కళానిధి మారన్ నిర్మించిన ఈ మూవీకి అనిరుధ్ సంగీతం సమకూర్చారు. గత కొన్ని రోజులుగా చెన్నైలో శరవేగంగా షూటింగ్ జరుపుకోగా, మంగళవారం చిత్రీకరణ పూర్తయినట్టు మేకర్స్ ప్రకటించారు. పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు పూర్తి చేసి ఆగస్టులో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అంతకు ముందు ఈ చిత్రానికి సంబంధించిన ప్రత్యేకమైన బీడీఎస్ ఫొటోలను చిత్ర బృందం సోషల్ మీడియాలో షేర్ చేసింది. అలాగే, ముగింపు సన్నివేశ చిత్రీకరణ వీడియో (మేకింగ్ వీడియో)ను కూడా షేర్ చేసింది.



← లోకేష్ కనకరాజ్ - రజనీకాంత్ మాటామంతి, ముగింపు వేడుకల్లో 'కూలీ' చిత్ర బృందం →



అవార్డు గ్రహీతలతో అప్సర రెడ్డి

9మందికి హ్యూమనిటేరియన్ అవార్డు

అడయార్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక కార్యకర్త అప్సర రెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ నగల దుకాణం ఎన్‌ఏసీ జ్యువెలరీ మహిళలను గౌరవించేలా 'హ్యూమానిటేరియన్ అవార్డు'లు ప్రదానం చేసింది. నగరంలో తాజాగా జరిగిన కార్యక్రమంలో గౌరి అడప్పా, సింధూర అరవింద్ సహా 9 మందికి ఈ అవార్డులను ప్రదానం చేశారు. సమాజంలో తమదైన ముద్ర వేసి తమ తమ రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్న మహిళలను గుర్తించి ఈ అవార్డులను అందజేశారు. ఈ తరహా కార్యక్రమం రెండో ఏడాది నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా అప్సర రెడ్డి మాట్లాడుతూ, తమతమ రంగాల్లో రాణించడమేకాకుండా, సమాజానికి దోహదపడే మహిళలను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్‌ఏసీ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ రామానుజం మాట్లాడుతూ, మహిళలకు సాధికారత కల్పించడం, వారిని గౌరవించడం ఆనందంగా ఉందన్నారు.

ఫీనిక్స్ మార్కెట్ సిటీలో మీట్ అండ్ గ్రీట్

అడయార్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలోని ఫీనిక్స్ మార్కెట్ సిటీలో నో యువర్ నైబర్‌హుడ్ (కేవైఎన్) ఆధ్వర్యంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. కేవైఎన్ లైవ్ - చెన్నై బిగ్గెస్ట్ ఫ్యూజన్ కాన్సర్ట్ పేరుతో దీనిని నిర్వహించింది. ఇందులో నటీనటులు ప్రదీప్ కుమార్, ఆండ్రియా జెర్మయ్య, పాల్ దబా అసల్ కోలార్ తదితరులు ఆడిపాడారు. ఈ ఈవెంట్‌కు సుమారు 500 మంది ప్రేక్షకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేవైఎన్ టెక్నాలజీస్ సీఈవో, ఫౌండర్ గాయత్రి త్యాగరాజన్ మాట్లాడుతూ, కేవైఎన్ అనేది చుట్టుపక్కల వారు పరిసరాల్లో ఏమి జరుగుతుందో తెలుసుకుని, అలాంటి వారిని ఒక చోటకు చేర్చడం కోసం ఏర్పాటు చేసిన వేదిక అన్నారు. ఈ తరహా కన్సర్ట్ నిర్వహించడం నగరంలో ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.



ఆండ్రియా, ప్రదీప్ కుమార్‌తో గాయత్రి త్యాగరాజన్

పోషకాల గని

అద్భుత ఆహార ఔషధం



అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో మొదటి ప్రాధ్యాన్యం ఖర్జూరం పండ్లదే. పగలంతా కఠోర ఉపవాస దీక్షల్లో పాల్గొనే ముస్లింలు, సాయంత్రం మొదటిగా తినేది ఖర్జూరాలనే. ఆ తర్వాత ఇతర ఫలాలు, గంజి తీసుకుని నీరు తాగి ఉపవాస దీక్ష విరమిస్తారు. మహమ్మద్ ప్రవక్త కూడా ఉపవాస దీక్షలో మొదటి ప్రాధాన్యం ఖర్జూరాలకే ఇచ్చేవారని ముస్లింలు విశ్వసిస్తున్నారు. ఆయన ఎక్కువగా స్వర్గలోకం నుండి వచ్చిన అజ్వా ఖర్జూర్, బర్నీ ఖర్జూరాలు తినేవారని ముస్లిం మతగురువులు బోధిస్తుంటారు.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి

● రంజాన్ మాసంలో ఖర్జూరాలకు ప్రత్యేక స్థానం



సత్వరం శక్తి... :ఆకలి దప్పులను హరించి శరీరానికి సత్వర శక్తినిచ్చే సుగుణాలు వున్న అద్భుత ఆహార ఔషధంగా ఖర్జూరాలకు ప్రత్యేక స్థానం ఉంది. అందువల్లే రంజాన్ మాసంలో ఉపవాసం వుండి, సూర్యాస్తమయం తర్వాత ఖర్జూరంతో ఉపవాసాన్ని విరమిస్తారు. దీనికి కారణం ప్రవక్త హజరత్ మహ్మద్ ఖర్జూరం పండ్లను చాలా ఇష్టపడే వారని ఆయన ఉపవాసాన్ని విరమించే సమయంలో వాటినే తినేవారని విస్వసిస్తున్న ముస్లింలు అప్పటి నుండి ఖర్జూరంతో ఉపవాస దీక్ష ముగించడం సంప్రదాయంగా కొనసాగిస్తున్నారు. ఖర్జూరంతో ఉపవాసం విరమించడం ఆరోగ్యానికి చాలా మంచిదని భావిస్తారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు అందరికీ ఈ పండ్లు ఆరోగ్యదాయమే. ఇనుము, క్యాల్షియం, పొటాషియం, విటమిన్లు, చక్కెర మూలాలు వీటిలో పుష్కలంగా వుండటంతో పాటు పీచుపదార్థాల శాతం కూడా అధికమే. సత్వర శక్తి లభించడంతో పాటు శారీరక వ్యవస్థలో లోపాలను సరిచేసే దివ్య ఆహార ఔషధం ఖర్జూరం.



వళ్ళిదేవిని ఏనుగు రూపంలో ఉన్న వినాయకుడు తరిమే దృశ్యాన్ని ప్రదర్శిస్తున్న ఆలయ నిర్వాహకులు

స్వామిమలైలో నేత్రపర్వంగా వళ్లీదేవి తిరుకల్యాణోత్సవం

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని స్వామిమలై స్వామినాథస్వామి ఆలయంలో వళ్లీదేవి తిరుకల్యాణోత్సవం మంగళవారం వేకువజామున నేత్రపర్వంగా జరిగింది. తమిళుల ఆరాధ్యదైవం మురుగప్పెరుమాన్ స్థిరనివాసమేర్పరచుకున్న ఆరుదివ్యక్షేత్రాల్లో నాలుగవదైన ఈ స్వామిమలై స్వామినాథ స్వామి ఆలయంలో పంగుణి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన వళీదేవి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా మంగళవారం వేకువజాము తిరువలంచుళి అరసాలంట్రమ్‌కరై వద్ద వృద్ధుడి వేషంలో ఉన్న మురుగప్పెరుమాన్‌ను వళ్ళిదేవి ప్రేమించి పెళ్ళి చేసుకునేందుకు విఘ్నేశ్వరుడు ఏనుగు రూపంలో సాయపడే ఘట్టాన్ని ఆలయన నిర్వాహకులు, స్థానిక కళాకారులు సంయుక్తంగా ప్రదర్శించారు. స్వామివారి లీలావిశేషంలో మురుగప్పెరుమాన్, వళ్లీదేవి ఉత్సవమూర్తులను ఆలయ పూజారులు, శైవపండితులు పల్లకీలో ఊరేగించారు. పల్లకీలో ఉన్న వళ్ళిదేవిని ఆలయ ఏనుగును తరిమేవిధంగా కళాకారులు నటింపజేశారు. స్వామినాథన్‌స్వామి ప్రేమ వివాహ ఘట్టాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించటంతో వేలాది మంది భక్తులు తన్మయం చెందారు.

కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో కీళ్లవాతంపై సదస్సు

చెన్నై, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్, కొలాబరేటివ్ ఆఫ్ ఇండియన్ రుమటాలజీ ఎడిటర్స్ (సీఐఆర్ఇ) సహకారంతో కీళ్లవాతంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు విశేష స్పందన వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. దేశవిదేశాల నుండి వైద్యనిపుణులు, పరిశోధకులు, వివిధ అంతర్జాతీయ సంచికల సంపాదకులు సహా సుమారు 250 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొని కీళ్లవాతంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టాల్సి చర్యలు, చికిత్సా విధానాలపై సమగ్రంగా చర్చలు జరిపారని, పరిశోధనా పత్రాలను సైతం సమర్పించారని సదస్సు నిర్వాహకుడు, కావేరి హాస్పిటల్ రుమటాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శ్యామ్ ఎస్ తెలిపారు. కావేరి హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్న రుమటాలజీ ప్రచురణల సంపాదకులు, వైద్యనిపుణులు



చెన్నైలో తొలి ఏసీ సబర్బన్ రైలు

● ప్రధాన రైల్వేస్టేషన్లలో మాత్రమే హాల్ట్ ● త్వరలో ప్రకటన



పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో అందుబాటులోకి రానున్న తొలి ఏసీ సబర్బన్ రైలు ప్రధాన స్టేషన్లలో మాత్రమే ఆగనుంది. ఈ మేరకు రైల్వేస్టేషన్ల వివరాలు, ప్రయాణ సమయాలను సిద్ధం చేశారు. ఏసీ సబర్బన్ రైలు ప్రారంభం తేదీ త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు. నగరం, శివారు ప్రాంతాలు కలిపేలా చెన్నై బీచ్-తాంబరం, చెంగల్పట్టు, చెన్నై సెంట్రల్-తిరువళ్లూర్-అరక్కోణం, చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి మార్గాల్లో సబర్బన్ రైళ్లు అందుబాటులో ఉన్నాయి. చెన్నై బీచ్-చెంగల్పట్టు మార్గంలో ఏసీ సబర్బన్ రైలు నడపాలనే ప్రయాణికుల విజ్ఞప్తిపై స్పందించిన రైల్వే శాఖ, రైలు తయారీ బాధ్యతను ఐసిఎఫ్‌కు అప్పగించింది. ఈ రైలులో 1,116 మంది కూర్చొని, 3,798 మంది నిల్చుని ప్రయాణించేలా డిజైన్ చేశారు. ఐసిఎఫ్‌లో ఏసీ సబర్బన్ రైలు తయారవగా, ట్రయల్ రన్ కూడా విజయవంతంగా నిర్వహించారు. త్వరలో ఈ రైలు ప్రజలకు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో, ఈ రైలు ప్రధాన రైల్వేస్టేషన్లలో మాత్రమే ఆగనుందని సమాచారం.

ఏసీ రైలు ఆగే స్టేషన్ల వివరాలు...

చెన్నై ఫోర్ట్, పార్క్, ఎగ్మూర్, మాంబళం, గిండి, సెయింట్ థామస్ మౌంట్, తాంబరం, పెరుంగళత్తూర్, పొత్తేరి, సింగపెరుమాళ్‌కోయిల్, భరనూరు, చెంగల్పట్టు.

రైలు సమయాలు...

ఉదయం 5.45-6.45 తాంబరం-చెన్నై బీచ్
ఉదయం 7-8.35 చెన్నై బీచ్-చెంగల్పట్టు
ఉదయం 9-10.30 చెంగల్పట్టు-చెన్నై బీచ్
మధ్యాహ్నం 3.45-5.25 చెన్నై బీచ్-చెంగల్పట్టు
సాయంత్రం 5.45-7.15 చెంగల్పట్టు-చెన్నై బీచ్
రాత్రి 7.35-8.30 చెన్నై బీచ్-తాంబరం

ఘనంగా ప్రేమలత జన్మదిన వేడుకలు

● సీఎం స్టాలిన్, ఈపీఎస్ సహా నేతల శుభాకాంక్షలు



కోయంబేడు పార్టీ కార్యాలయం వద్ద చలివేంద్రం ప్రారంభించి ప్రజలకు కర్బూజా ముక్కలు పంపిణీ చేస్తున్న ప్రేమలత

ప్యారీస్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత జన్మదిన వేడుకలను మంగళవారం ఉదయం ఆ పార్టీశ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ప్రేమలతకు ముఖ్యమంత్రి స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సహా పలుపార్టీల నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కోయంబేడులోని డీఎండీకే పార్టీ కార్యాలయం వద్ద తన జన్మదినం సందర్భంగా ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రేమలత ప్రారంభించి ప్రజలకు కర్బూజా ముక్కలు, మజ్జిగ, శీతల పానియాలు పంపిణీచేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత ఏడాది మార్చి 20న డీఎండీకే - అన్నాడీఎంకేల మధ్య పొత్తుపై కుదుర్చుకున్న ఒప్పంద పత్రంలో డీఎండీకేకు రాజసభ సీటు ప్రస్థావన లేదని ఆమె తెలిపారు. అదేవిధంగా 2026 అసెంబ్లీ ఎన్నికల పొత్తుగురించి అదే సంవత్సరం మార్చి 18 న స్పష్టమైన నిర్ణయాన్ని తెలియజేస్తానని ఆమె అన్నారు. ఇదిలా వుండగా ముఖ్యమంత్రి స్టాలిన్ ఫోన్ చేసి ప్రేమలకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ కూడా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సంక్షేమం కోసం మీ సేవలు కొనసాగాలని ఆకాంక్షిస్తూ వారు వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనలో ప్రేమలతకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎయిర్‌పోర్ట్ - కిలాంబాక్కం మధ్య రూ.9335 కోట్లతో కొత్త మెట్రోరైలు మార్గం



టి.నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం నుంచి కిలాంబాక్కం బస్ టెర్మినల్ వరకు రూ.9335 కోట్లతో మెట్రోరైలు మార్గం నిర్మించనున్నారు. ఈ మేరకు మెట్రోరైలు సంస్థ రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. మెట్రోరైలు ప్రాజెక్టు-1 విస్తరణలో భాగంగా ఈ రెండు ప్రాంతాల మధ్య మెట్రోరైలు మార్గాన్ని నిర్మించనున్నారు. ఈ రైలు మార్గం ప్రణాళికను మెట్రోరైలు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధిక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రయత్నాల శాఖ కార్యదర్శి కె.గోపాల్‌కు సమర్పించారు. మొదటి దశ మెట్రోరైలు ప్రాజెక్టు ప్రకారం చెన్నై సెంట్రల్ నుండి పరంగిమలై దాకా, విమ్కోనగర్ నుంచి విమానాశ్రయం వరకు నిర్మించిన మార్గాల్లో మెట్రోరైళ్లు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో మొదటి దశ మెట్రోరైలు ప్రాజెక్టును విమానాశ్రయం నుంచి కిలాంబాక్కం బస్ టెర్మినల్ వరకు విస్తరింపజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రెండు ప్రాంతాల నడుమ 15.46 కి.మీ.ల దూరం వరకు మెట్రో రైలు మార్గాన్ని నిర్మించనున్నామని పేర్కొన్నారు.

13 రైల్వేస్టేషన్లు...

ఈ మార్గంలో విమానాశ్రయం వద్ద కొత్తగా మరొక మెట్రో రైల్వేస్టేషన్ నిర్మిస్తారు. అక్కడి నుంచి కిలాంబాక్కం వరకు మార్గమధ్యంలో పల్లావరం, కోదండం నగర్, క్రోంపేట, మహాలక్ష్మి కాలనీ, తిరువికనగర్, తాం బరం, ఇరుంబులియూరు, పీర్కాక్కరణై, పెరుంగళత్తూరు, వండలూరు, అరింజర్ అన్నా జంతు ప్రదర్శనశాల, కిలాంబాక్కం తదితర మొత్తం 13 రైల్వేస్టేషన్లు నిర్మించనున్నారు.

మే 16 నుంచి ఊటీలో పుష్ప ప్రదర్శన



ఊటీలో కనువిందు చేస్తున్న పూలమొక్కలు

పెరంబూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీలో పుష్ప ప్రదర్శన మే 16 నుంచి 21వ తేది వరకు జరుగనుంది. నీలగిరిలో ప్రతి ఏడాది మే నెలలో వేసవి ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.ఈ ఏడాది నిర్వహించనున్న ఉత్సవాలపై మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ డైరెక్టర్ కుమారవేల్ పాండ్యన్ ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. ఈ సమావేశంలో వేసవి ఉత్సవాలు నిర్వహించే తేదీలు నిర్ణయించారు. ఆ ప్రకారం, కోతగిరిలో 13వ పండ్ల ప్రదర్శన మే 3,4 తేదీలు, కూడలూరులో 12వ సుగంధ ద్రవ్యాల ప్రదర్శన మే 9,10,11 మూడు రోజులు నిర్వహించనున్నారు. అలాగే, ఊటీ రోజా పార్క్‌లో 20వ రోజాల ప్రదర్శన మే 10,11,12 తేదీల్లోను, ఊటీ ప్రభుత్వ బొటానికల్ గార్డన్‌లో పుష్ప ప్రదర్శన మే 16 నుంచి 21వ తేది వరకు జరుగనుంది. అదేవిధగా కున్నూర్‌లో 65వ పండ్ల ప్రదర్శన మే 23 నుంచి 25వ తేది వరకు, కున్నూర్ కాట్టేరి పార్క్‌లో తొలిసారిగా కొండ పంటల ప్రదర్శన మే 31, జూన్ 1వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఉద్యానవన శాఖ డైరెక్టర్ కుమారవేల్ పాండ్యన్ తెలిపారు.



అన్నప్రసాదం ట్రస్టుకు రూ.పది లక్షలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందిస్తున్న తిరుపతికి చెందిన కేఎస్పీ టాకీస్ ఛైర్మన్ కేతన్ శివ ప్రీతమ్


సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం తిరుమలకు రానున్నారు. పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుమల వరకు ఏఎస్ఎల్ నిర్వహించారు. బాంబు, డాగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేశాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటనలో ఎలాంటి చిన్న పొరబాట్లూ జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక డాక్టర్లను నియమించాలని, అధునాతన లైఫ్ సపోర్టు అంబులెన్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, డీఎంహెచ్‌వో బాలాజీ నాయక్, ఫైర్ అధికారి రమణయ్య, విమానాశ్రయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భర్త, ప్రియురాలికి పదేళ్ల జైలు

రామచంద్రాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భార్య ఆత్మహత్య కేసులో భర్త, అతని ప్రియురాలికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి గురునాథ్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. పాతవేపకుప్పం గ్రామానికి చెందిన మమత, గోపి దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. అయితే గోపి అదే గ్రామానికి చెందిన భారతితో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యతో గొడవ పడేవాడు. ఈనేపథ్యంలో ఆమె 2018 ఫిబ్రవరి 19న ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి ఎస్ఐ భాస్కర్‌నాయక్ కేసు నమోదు చేశారు. అనంతరం వచ్చిన ఎస్ఐ సాదిక్ ఆలీ విచారణ వేగవంతం చేశారు. గోపి, భారతి చర్యల వల్ల మమత ఆత్మహత్యకు పాల్పడిందని న్యాయమూర్తి గురునాథ్ పేర్కొంటూ వారిద్దరికీ పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.84 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,824

తలనీలాలు సమర్పించినవారు: 25,674



మార్చి.. అప్పుడే మాడ్చి

- నిప్పులు చెరుగుతున్న సూర్యుడు
- అల్లాడిపోతున్న ప్రజానీకం





ఈ ఏడాది సూరీడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. మార్చిలోనే ప్రతాపం చాటుతున్నాడు. సాధారణంగా మేనెలలో 40 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరేది. అలాంటిది మంగళవారం ఆమేరకు చేరుకోవడంతో జిల్లా ప్రజానీకం బెంబేలెత్తుతున్నారు. తిరుమలేశుడి దర్శనానికి తిరుపతి చేరుకునే భక్తులు అల్లాడిపోతున్నారు. ఇక, తిరుపతిలో ఉదయం పది నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రోడ్లపై జనసంచారం పలచగా ఉంటోంది. అమ్మకాలు సాగడంలేదని చిరువ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులు ప్రాంగణంలోని చెట్లనీడలో సేదతీరుతూ కనిపిస్తున్నారు. రూయా, మెటర్నరీ వైద్యశాలల వద్ద రోగులు,వారి బంధువులు చెమటలు కక్కుతూ నీడకోసం వెంపర్లాడుతున్నారు. పాదచారులు, ద్విచక్రవాహనదారులు, చిరు వ్యాపారులకు గరుడవారధి గొడుగులా మారింది. మరోపక్క ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నాపెద్దా తక్షణ ఉపశమనం కోసం జ్యూస్ సెంటర్లకు క్యూ కడుతున్నారు. కర్బూజా అమ్మకాలు జోరందుకున్నాయి. ఇళ్లలో ఫ్రిజ్‌లున్నా సహజమైన చల్లదనం కోసం జనం కుండలపై ఆసక్తి చూపిస్తున్నారు. తిరుమల కొండ మీద భక్తులు ఎండవేడిమికి తాళలేక మాడవీధుల నుంచి నీడ కోసం పరుగులు తీస్తున్నారు.

- తిరుపతి(లీలామహల్), ఆంధ్రజ్యోతి

ఎండలతో జాగ్రత్త



వడదెబ్బ అవగాహన పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ అన్నారు. వడదెబ్బ అవగాహన బ్యానర్లు, పోస్టర్లను మంగళవారం ఆయన తిరుపతిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విడుదల చేశారు. ఎండల తీవ్రత నేపథ్యంలో అవసరమైతే తప్ప ఎండలో బయటకు రాకూడదన్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎండ నుంచి రక్షణగా టోపీ, గొడుగులు వంటివి వాడాలన్నారు. నీటితో పాటు పళ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. నీరసం, కళ్లు తిరగడం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బగా గుర్తించి.. సమీప ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐవో శాంతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ, జిల్లా మలేరియా అధికారి రూప్‌కుమార్, వైద్యాధికారులు మధుబాబు, లావణ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు ఒకరి మృతి



చెంగల్రాయులు (ఫైల్ ఫొటో)

రామచంద్రాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం గంగిరెడ్డిపల్లెలో వడదెబ్బకు పూజారి చెంగల్రాయులు(65) మృతిచెందారు.మంగళవారం ఉదయం 10గంటలకు పొలం వద్దకు వెళ్లిన ఆయన.. మధ్యాహ్నం 12గంటలకు ఇంటికి వచ్చారు. గుండె నొప్పిగా ఉందంటూ కుప్పకూలారు. 108 వాహనం ద్వారా తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. వడదెబ్బ వల్లే మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

అద్దెకు కారు తీసుకుని.. ఉడాయించిన ఘనుడు

- అరెస్టు చేసిన పోలీసులు
- మూడు కార్లు స్వాధీనం



కార్ల దొంగను అరెస్టు చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): అద్దెకు కారు తీసుకున్నాడు. ఐదు రోజులు తిరిగి.. ఆపై ఉడాయించాడు. చివరకు ఇతడిని మంగళవారం అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. ఇతడి నుంచి మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపిన ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, చిన్న మిరానికి చెందిన మహేష్ నూతన కుమార్.. నకిలీ ఆధార్ కార్డు చూపించి ఈనెల 11న తిరుపతిలో ఓ కారును అద్దెకు తీసుకున్నాడు. ఐదు రోజుల పాటు కారును వాడుకున్న తర్వాత.. కర్నూలు జిల్లా దాటి తెలంగాణ సరిహద్దుకు చేరుకున్నాడు. అక్కడ కారుకు ఉన్న జీపీఆర్ఎస్ వైర్లు తొలగించాడు. తన మొబైల్ ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశాడు. దీనిపై బాధితుడు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రాంకిషోర్ పర్యవేక్షణలో ఎస్ఐ లోకేష్‌బాబు, సిబ్బంది కలిసి నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. తిరుపతి జూ పార్కు రోడ్డులో వున్నట్లు గుగూల్ మ్యాప్ ద్వారా మంగళవారం గుర్తించి అతడిని అరెస్టు చేశారు. గతంలో జైపూర్, ఢిల్లీ ప్రాంతాల్లో జూమ్ కార్లు అద్దెకు తీసుకుని ఉడాయించినట్లు గుర్తించారు. ఇతడిపై కోల్‌కత్తా, ఢిల్లీ, హైదరాబాదు, చెన్నై, భీమవరం, ముంబై నగరాల్లో మొత్తం 24 కేసులు నమోదైనట్లు గుర్తించారు. గతంలో ఐదుసార్లు జైలు శిక్ష అనుభవించాడు. నిందితుడి జైపూర్, ఢిల్లీ, తిరుపతికి చెందిన మూడు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

టీటీడీ తిరుపతి ఎస్టేట్స్ అధికారి బదిలీ

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల-తిరుపతి దేవస్థానాలలో తిరుపతి ఎస్టేట్స్ అధికారిగా పనిచేస్తున్న జి.గుణభూషణ్ రెడ్డి బదిలీ అయ్యారు. రెవిన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన ఆయన గతేడాది జనవరి 10వ తేదీన దేవదాయ శాఖకు డెప్యుటేషన్‌పై బదిలీ అయి టీటీడీ తిరుపతి ఎస్టేట్స్ అధికారిగా నియమితులయ్యారు. తాజాగా ప్రభుత్వం ఆయనను టీటీడీ నుంచీ బదిలీ చేసి కర్నూలు జిల్లా బీజీ రైల్వే విభాగం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జరిమానా లేదా జైలుకు పంపండి

- నాటుసారా నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ ఆదేశం



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయా తహసీల్దార్లు నాటుసారా నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి రూ.లక్ష జరిమానా లేదా జైలుశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. నాటుసారా నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నవోదయం 2.0' పోస్టర్లను మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించి.. జిల్లా ఎక్సైజ్‌తో పాటు ఇతర అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ, పంచాయతీ, అటవీ, వైద్య ఆరోగ్య, డీఆర్‌డీఏ శాఖల అధికారులు మండల.. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన పెంచడానికి గ్రామసభలు నిర్వహించాలన్నారు. రాబోయే మూడు నెలల్లో తిరుపతిని నాటు సారా రహిత జిల్లాగా తయారు చేయడానికి కృషి చేస్తామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో నిందితులకు పునరావాసం కల్పించి పరివర్తన తీసుకొస్తామని ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ చెప్పారు. నేరస్థులపై పీడీయాక్ట్ పెట్టి సారా వృత్తి నుంచి బయటపడేలా చర్యలు తీసుకుంటామని ఏసీ శ్రీనివాసాచారి చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఈఎస్ నాగమల్లీశ్వరరెడ్డి, డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్‌హెచ్ భూసేకరణ పురోగతి పనులపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి వర్చువల్‌గా అధికారులతో సమీక్షించారు.

తిరుమలలో సాధువుల ధర్నాపై పోలీసులు సీరియస్

- 118 మందిపై కేసులు నమోదు
- పునరావృతం కాకుండా చట్టాల కఠినతరానికి నిర్ణయం

తిరుమల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా సాధువులు ధర్నాకు దిగడంపై పోలీసులు సీరియస్ అయ్యారు. ముందస్తుగా నోటీసులు జారీ చేసినప్పటికీ ఆలయ చట్టాలకు వ్యతిరేకంగా శ్రీవారి ఆలయం ముందు ధర్నా చేసిన 118 మందిపై బీఎన్ఎస్ ప్రివెంట్ అరెస్ట్ సెక్షన్ 151 కింద కేసులు నమోదు చేశారు. అలిపిరిలో ముంతాజ్ హోటల్‌కు కేటాయించిన జీవో నెంబరు 24ను రద్దు చేసి ఆ స్థలాన్ని భక్తుల సౌకర్యార్థం కేటాయించాలనే డిమాండ్‌తో ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానందస్వామి ఆధ్వర్యంలో పలు రాష్ట్రాలకు చెందిన సాధువులు, బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, ఆయన అనుచరులు సోమవారం శ్రీవారి ఆలయం ముందు ధర్నా చేసిన విషయం తెలిసిందే. ధర్నాలో పాల్గొన్న 118 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై పంపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా ఆలయ చట్టాలను మరింత కఠినతరం చేయాలని పోలీసులు భావిస్తున్నారు. భక్తులను భయభ్రాంతులకు గురిచేయడంతోపాటు విధుల్లోని సిబ్బందికి ఆటంకం కలిగించేలా వ్యవహరించే వ్యక్తులపై ఇకపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. ఈ అంశాన్ని తేలికగా తీసుకుంటే భవిష్యత్తులో ఇలాంటివి మరిన్ని చోటుచేసుకునే అవకాశముందనే అంచనాతో ఆలయ చట్టాలను కఠినంగా అమలుచేయాలని భావిస్తున్నారు. కాగా, ఆదర్శంగా ఉండాల్సిన సాధువులే అల్లర్లు చేస్తే ఎలా? అని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు తిరుమలలో నిరసనకు దిగడం అపచారమని సాధువులకు తెలియదా? అని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎండ తీవ్రత దృష్ట్యా ఇకపై గంట ముందే పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, మండలకేంద్రాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను ఎండల తీవ్రత దృష్ట్యా ఒక గంట ముందే నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ జరుగుతుందని పేర్కొన్నారు.

శ్రీసిటీలో నేషనల్ డిఫెన్సు కళాశాల అధికారుల పర్యటన



శ్రీసిటీ గురించి వివరిస్తున్న ఎండీ రవీంద్రసన్నారెడ్డి

శ్రీసిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భారతదేశ పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ఆర్థికాభివృద్ధిపై అధ్యయనంలో భాగంగా న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్సు కళాశాలకు చెందిన 17మంది సభ్యుల బృందం మంగళవారం శ్రీసిటీలో పర్యటించింది. మేజర్ సి.పి.సంగ్రా నేతృత్వంలో భారత సాయుధ దళాల ఉన్నతాధికారులు, విదేశీ ప్రతినిధులతో విచ్చేశారు. శ్రీసిటీ ఏకీకృత వ్యాపారానుకూల వాతావరణం, ప్రపంచ పెట్టుబడులకు అనువైన గమ్యస్థానం, భారతదేశ తయారీ, లాజిస్టిక్స్, ఏరో స్పేస్, డిఫెన్సు రంగాల్లో భాగస్వామ్యం గురించి వారికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి వివరించారు. శ్రీసిటీ తర్వాత ఈ ప్రాంతంలో వచ్చిన మార్పులనూ తెలియజేశారు. శ్రీసిటీ పారిశ్రామిక విధానం, సులభతర వ్యాపారం, లాజిస్టిక్స్ సామర్థ్యం, సామాజిక వసతులు, భద్రత తదితర అంశాలపై ప్రతినిధి బృందం చర్చించింది. వికసిత్ భారత్ లక్ష్యంగా శ్రీసిటీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, క్రమశిక్షణ అద్భుతమంటూ టీం లీడర్ ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ పర్యటన కోఆర్డినేటర్లుగా మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

భక్తుల రక్షణ కోసం..

- తిరుమలలో కాలంచెల్లిన సిల్వర్‌ఓక్ వృక్షాల తొలగింపు



తిరుమలలో తొలగించిన సిల్వర్‌ఓక్ వృక్షాలు

తిరుమల, మార్చి18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కాలంచెల్లిన సిల్వర్‌ఓక్ వృక్షాల తొలగింపు ప్రక్రియ మొదలైంది. ప్రధాన ఉద్యానవనాల్లో నీడ కోసం సిల్వర్‌ఓక్ వృక్షాలను టీటీడీ 1980లో ఏర్పాటు చేసింది. వీటి కాలపరిమితి 30 ఏళ్లు. ప్రస్తుతం తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఈ వృక్షాలు చిన్నపాటి గాలులు, వర్షాలతో నేలకూలుతున్నాయి. ఇప్పటివరకు కూలినచెట్ల కారణంగా అనేక వాహనాలు, నిర్మాణాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో భక్తుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని జనసంచారంలో ఉండే కాలం చెల్లిన సిల్వర్‌ఓక్ చెట్లను గుర్తించాలని ఉన్నతాధికారులు ఫారెస్ట్ విభాగాన్ని ఆదేశించారు. వీరు 839 కాలంచెల్లిన వృక్షాలను గుర్తించారు. కూలిపోయే స్థితిలో ఉన్నట్టు నిర్ధారించారు. వీటి కొమ్మలు, ఆకులు నిత్యం పడుతుండటంతో విశ్రాంతి భవనాలు కూడా మరమ్మతులకు గురవుతున్నట్టు నివేదికలో పేర్కొన్నారు. ప్రస్తుతం మొదలైన వీటి తొలగింపు పనులు.. మూడునెలల్లో పూర్తికానున్నాయి. వాటి స్థానంలో దాదాపు 40 రకాల పూలు, పండ్లు, నీడనిచ్చే చెట్లను నాటాలని ఫారెస్ట్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు.